క్లుప్తంగా

ఎండీఎం కార్మికులకు బడ్జెట్ కేటాయించాలి



మాట్లాడుతున్న శ్రీనివాస్

పెంచికల్‌పేట్: ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులకు బడ్జెట్ కేటాయించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ముంజం శ్రీనివాస్ శనివారం డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కేసీఆర్ అల్పాహారం పేరుతో ప్రారంభించిన పథకానికి ప్రతీ విద్యార్థికి కార్మికులకు రూ.25 చెల్లించాలన్నారు. సంఘం మండల అధ్యక్షురాలు పద్మ, కార్మికులు పాల్గొన్నారు.

ముస్లిం నాయకుల ప్రత్యేక ప్రార్థనలు



ప్రార్థనలు చేస్తున్న మైనార్టీ నాయకులు

ఆసిఫాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో ఆసిఫాబాద్ ఎమ్మెల్యేగా కోవ లక్ష్మి విజయం సాధించాలని జిల్లా కేంద్రంలోని దర్గా వద్ద బీఆర్‌ఎస్‌కు చెందిన ముస్లిం మైనార్టీ నాయకులు శనివారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అంతకు ముందు పట్టణంలోని సంతలో కోవ లక్ష్మికి ఓటు వేయాలని కోరుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు అహ్మద్ బిన్ అబ్దుల్లా, నాయకులు సయ్యద్ అన్సార్, ఎండీ అహ్మద్, సయ్యద్‌నిసార్, షబ్బీర్, పోశన్న, రాజ్‌కుమార్, సమీర్ ఖాన్ పాల్గొన్నారు.

పాఠశాలలో వైద్యశిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

వాంకిడి: మండలంలోని తేజాపూర్ ప్రాథమిక పాఠశాలలో శనివారం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో పర్యటించి గ్రామస్తులకు పారిశుధ్యంపై అవగాహన కల్పించారు. గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం పంపిణీ చేసే టీకాల ప్రయోజనాలు వివరించారు. మురికి కాలువల్లో యాంటీ లార్వా, తెమిఫోస్ మందులు పిచికారీ చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి రవిదాస్, హెల్త్ అసిస్టెంట్ కృపావాణి, భగవాన్‌దాస్, ఎంఎల్‌హెచ్‌పీ మమత, బ్రీడింగ్ చెక్కర్ చంద్రశేఖర్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

నేడు పోస్టర్ ఆవిష్కరణ

కౌటాల: మండల కేంద్రంలోని శ్రీ కేతేశ్వర స్వామి -కంకలమ్మ దేవి అమ్మవార్ల జాతర పోస్టర్లను ఆదివారం ఆవిష్కరించనున్నట్లు దేవస్థాన కమిటీ చైర్మన్ సుల్వ కనకయ్య శనివారం తెలిపారు. డిసెంబర్ 10న గుట్టపై గల కంకలమ్మ దేవి ఆలయంలో మహా జాతర నిర్వహిస్తామని తెలిపారు. నేడు ఉదయం 10.30 గంటలకు కంకలమ్మ ఆలయంలో శ్రీ ఎర్ర పోచమ్మ దేవికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని, అనంతరం జాతర నిర్వహణ ప్రత్యేక సమావేశం ఉంటుందన్నారు. ఎమ్మెల్యే కోనేరు కోనప్ప సతీమణి కోనేరు రమాదేవి చేతుల మీదుగా జాతర కరపత్రాలు, గోడప్రతులు ఆవిష్కరించనున్నట్లు తెలిపారు.

జీవాలకు టీకాలు వేయించాలి


తలమడుగు: ప్రతీ గ్రామంలో గొర్రెలకు, మేకలకు పీపీఆర్ టీకాలు వేయించాలని పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రామారావు అన్నారు. శనివారం మండలంలోని భరంపూర్‌లో పశువైద్య శిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఈనెల 20 వరకు అన్ని గ్రామాల్లో సిబ్బంది వచ్చి టీకాలు వేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ భాగీర్త బాయి, మహేశ్, మండల పశువైద్యాధికారి దుద్‌రాం రాథోడ్, సిబ్బంది సౌమ్య, స్వామి, అమీన్, గోపాల మిత్రులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

బోథ్: చట్టాలపై ప్రతిఒక్కరికీ అవగాహన ఉండాలని బోథ్ జూనియర్ సివిల్ కోర్టు జిల్లా జడ్జి హుస్సేన్ అన్నారు. శనివారం మండలంలోని దన్నూర్(కె) గ్రామంలో ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాల నిరోధక చట్టం, మోటారు వాహనాల చట్టం, ఉచిత న్యాయసేవ, ఇతర చట్టాల గురించి వివరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఆడెపు హరీష్, కుమ్మరి విజయ్ కుమార్, సూపరింటెండెంట్ చంద్రశేఖర్ రెడ్డి, ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ చంద్రమౌళి, సర్పంచ్ శిరీష, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



మట్టి దీపాలు తయారు చేస్తున్న కళాకారుడు



తయారు చేసిన మట్టి పాత్రలు



కాలుతున్న అగ్గివాము



తయారు చేసిన దీపం ప్రమిదలు

మట్టి బతుకుల్లో దీపాల కాంతులు

- తరాలుగా కులవృత్తినే నమ్ముకున్న కళాకారులు
- దీపావళికి తయారవుతున్న ప్రమిదలు
- ఆదరించాలని వేడుకుంటున్న కుమ్మరులు

చింతలమానెపల్లి: దీపావళి అంటే ఇళ్లంతా దీపాలతో అలంకరించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. పండుగ వేళ ఇంటిని వెలుగులతో నింపే దీపం ప్రమిదల తయారీ వెనుక తరాలుగా మట్టిలోనే మగ్గుతున్న కుమ్మరుల జీవితాలు ఉన్నాయి. నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో ఉన్న కుమ్మరులు వివిధ ఆకృతుల్లో దీపపు ప్రమిదలతో పాటు వివిధ రకాల మట్టి పాత్రలు తయారు చేస్తూ జీవనం గడుపుతున్నారు. వీరు తయారు చేసే మట్టి వస్తువులకు ఎంతో ప్రాముఖ్యత ఉంది. దీపావళి సందర్భంగా దీపపు ప్రమిదలు తయారు చేసి జిల్లాలో విక్రయించడంతో పాటు మంచిర్యాలకు తరలిస్తున్నారు.

కుమ్మర వృత్తే జీవనాధారం

సిర్పూర్(టి) నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో 5వేలకుపైగా కుమ్మర కులస్తులు ఉన్నారు. కొన్ని ప్రాంతాలలో కుమ్మర వృత్తికి ఆదరణ కొరవడంతో ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలను వెతుక్కుంటున్నారు. చింతలమానెపల్లి మండలంలోని రుద్రాపూర్, కౌటాల మండలంలోని తలోధి, గురుడుపేట, బెజ్జూర్ మండల కేంద్రంతో పాటు మండలంలోని బారెగూడ, దహెగాం మండలంలోని కొంచవెల్లి, పెంచికల్‌పేట్ మండలంలోని పలు గ్రామాల్లోని కుమ్మరులు తయారు చేసే మట్టి పాత్రలకు ఎంతో గుర్తింపు ఉంది. ఈ ప్రాంతాల్లో తరాలుగా కుమ్మర వృత్తిని నమ్ముకొని జీవనం సాగిస్తున్నారు. ఇక్కడ తయారు చేసిన మట్టి పాత్రలను మంచిర్యాలకు సైతం తరలిస్తున్నారు.

వివిధ ఆకృతుల్లో ప్రమిదల తయారీ..

దీపపు ప్రమిదలతో పాటు వివిధ రకాల పాత్రలు వివిధ ఆకృతుల్లో తయారు చేయాలంటే కుమ్మరులు తీవ్ర ప్రయాసలకు గురవుతుంటారు. దీపావళి వంటి పండుగలు వచ్చినప్పుడు కుమ్మరులు తయారు చేసే మట్టి దీపాలకు బాగా గిరాకీ ఉంటుంది. కౌటాల, బెజ్జూర్, చింతలమానెపల్లి మండలాల కుమ్మరులు సిర్పూర్(టి) మండలం కంచరపేట సమీపంలో మట్టిని దీపాలు, మట్టి పాత్రల తయారీ కోసం సేకరిస్తుంటారు. కాగజ్‌నగర్ మండలంలోని గన్నారం సమీపంలో గల మట్టి దీపాల తయారీకి అనువుగా ఉంటుందని కుమ్మర కళాకారులు పేర్కొంటున్నారు. సేకరించిన మట్టిని తడిపి ముద్దగా చేసి చక్రంపై గుండ్రంగా తిప్పుతూ ప్రమిదలకు ఆకృతిని తీసుకొస్తారు. వాటిని ఆరబెట్టి అనంతరం వాముబట్టీలో పేర్చి కాలుస్తారు. ఒక రోజు అనంతరం బయటకు తీసి మార్కెట్‌కు తరలిస్తారు.

ఆదరణ కరువు..

తరాలుగా వస్తున్న కుమ్మర వృత్తికి ఆధునిక సమాజంలో ఆదరణ కరువైంది. కుమ్మర వృత్తిదారులను ప్రభుత్వం, ప్రజలు ఆదరించాల్సిన అవసరం ఉంది. పర్యావరణానికి హాని చేయకుండా ఆరోగ్యవంతమైన జీవనానికి ఉపకరించే కుమ్మర వృత్తి మనుగడ కోల్పోకుండా చూడాల్సిన బాధ్యత ఉంది. మట్టి కళాకారులకు ప్రభుత్వం శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నా అవి కంటి తుడుపుగానే ఉంటున్నాయి. మరింత శాస్త్రీయ చేయూతను అందించి వ్యాపారం నిర్వహించుకునేలా ప్రోత్సహించాలని కుమ్మర కళాకారులు డిమాండ్ చేస్తున్నారు. మండల కేంద్రాల్లోని ప్రభుత్వ వాణిజ్య సముదాయాలు, వారసంతల్లో వ్యాపారం నిర్వహించుకునేందుకు కుమ్మరులకు అవకాశం కల్పించాలని పేర్కొంటున్నారు. మట్టి వస్తువులను వినియోగించేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని, ప్రభుత్వ పథకాలను అందించాలని కోరుతున్నారు. దీపావళి వంటి ప్రత్యేక సందర్భాలలో కుమ్మరులకు వ్యాపారం చేసుకునేందుకు ప్రత్యేక సదుపాయాలు కల్పించాలని వేడుకుంటున్నారు.

ప్రభుత్వం ప్రోత్సహించాలి



నేను కుమ్మరి వృత్తిపై ఆధారపడి గత 40ఏళ్లుగా జీవిస్తున్నాను. చేతివృత్తులను ప్రభుత్వం ప్రోత్సహించాలి. ప్లాస్టిక్ యుగంలో చేతి వృత్తులకు ఆదరణ కరువైంది. దీంతో కుటుంబ పోషణ భారంగా మారింది. కుమ్మరులకు ప్రభుత్వం ప్రత్యేక నైపుణ్యాలపై శిక్షణ ఇవ్వాలి. ప్రభుత్వం సబ్సిడీపై రుణాలు ఇచ్చి ఆదుకోవాలి.

– వర్రెల్లి రంగయ్య, బెజ్జూర్

ప్రజలు ఆదరించాలి



చేతివృత్తులపై ఆధారపడి ప్రజలకు నాణ్యమైన ఉత్పత్తులు చేసి అందిస్తున్నాం. పండగ పూట మట్టి దీపాలకు గిరాకీ ఉంటుంది. గతంలో మాదిరి మట్టి కుండలు, పాత్రలు, దీపాల కొనుగోలుకు ప్రజలు ఆసక్తి చూపడం లేదు. మట్టి పాత్రల్లో చేసిన వంటలు తింటే ఆరోగ్యంగా ఉంటారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కుమ్మరులను ప్రభుత్వం ఆదుకోవాలి.

– తాళ్లపల్లి శ్రీనివాస్, చింతలమానెపల్లి

ఎమ్మెల్యే దంపతుల పూజలు

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని పెద్దవాగు ఒడ్డున గల గాంధారి మైసమ్మ దేవాలయంలో శనివారం ఎమ్మెల్యే దంపతులు కోనేరు కోనప్ప, రమాదేవిలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి ఓడిబియ్యం సమర్పించి దర్శనం చేసుకున్నారు. కార్యక్రమంలో టీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు వీవీ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కోనప్ప గెలువాలని మొక్కులు



మోకాళ్లపై మెట్లు ఎక్కుతున్న ఉమాకాంత్

కాగజ్‌నగర్‌రూరల్: ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఎన్నికల్లో అధిక మెజార్టీతో గెలువాలని మండలంలోని రాస్పెల్లి గ్రామానికి చెందిన వీరాభిమాని ఇనుముల ఉమాకాంత్ తిరుమల తిరుపతి దేవస్థాన ఏడుకొండలు మోకాళ్లపై ఎక్కి అభిమానం చాటుకున్నాడు. ఆయన వెంట నాయకులు బైరగోని రాజు, కోలేటి శివప్రసాద్ ఉన్నారు.

పొదుపుతో అధిక లాభాలు



మాట్లాడుతున్న కౌసల్య

కెరమెరి: సంఘంలోని మహిళలు పొదుపు చేయడం వల్ల అధిక లాభాలు గడించవచ్చని ఐకేపీ సీసీ కౌసల్య అన్నారు. శనివారం మండలంలో కొలాంగూడ(ఆగుర్‌వాడ) గ్రామంలో శ్రీ వెంకటేశ్వర సంఘం సభ్యులతో మాట్లాడారు. బ్యాంకు నుంచి తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రైతు ఉత్పత్తిదారుల సంఘం ఏర్పాటు చేశారు.

‘బీఆర్‌ఎస్‌తోనే అందరికి సమన్యాయం’



కొఠారీలో మాట్లాడుతున్న నాయకులు

కెరమెరి: అందరికి సమన్యాయం కేవలం బీఆర్‌ఎస్ పార్టీతోనే సాధ్యమవుతుందని ఎంపీపీ పెందోర్ మోతిరాం, జెడ్పీటీసీ సెడ్మకి దుర్పతబాయి, వైస్ ఎంపీపీ అబ్దుల్ కలాం అన్నారు. శనివారం మండలంలోని కొఠారి, గోయగం, ధనోరా, పార్ద గ్రామపంచాయతీల్లో ప్రచారం చేపట్టారు. వారు మాట్లాడారు. ప్రస్తుతం ఉన్న పథకాలు ఇలాగే నిరంతరంగా కొనసాగాలంటే మరోసారి బీఆర్‌ఎస్ అభ్యర్థి కోవ లక్ష్మిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

రెబ్బెనలో..

రెబ్బెన: మండలంలోని కొమురవెల్లి, గోలేటి పంచాయతీల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి కోవ లక్ష్మికి మద్దతుగా బీఆర్‌ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు శనివారం ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటు వేసి కోవ లక్ష్మిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. గోలేటిలో సర్పంచ్ పోటు సుమలత ఆధ్వర్యంలో మహిళలు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జెడ్పీటీసీ సంతోష్, ఎంపీపీ సౌందర్య, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పోటు శ్రీధర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సంజీవ్‌కుమార్, సర్పంచులు సోమశేఖర్, మాజీ జెడ్పీటీసీ ప్రకాశ్‌రావు, వైస్ ఎంపీపీ సత్యనారాయణ, నాయకులు చిరంజీవిగౌడ్, రాజేశ్ పాల్గొన్నారు.

జైనూర్‌లో..

జైనూర్: బీఆర్‌ఎస్ గెలుపునకు ప్రతీ కార్యకర్త సైనికుడిలా పని చేయాలని మండల అధ్యక్షుడు ఇంతియాజ్‌లాలా, సీనియర్ నాయకుడు మెస్రం అంబాజీలు అన్నారు. శనివారం మండలంలోని జామిని గ్రామంలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోవ లక్ష్మిని గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. సహకార సంఘం చైర్మన్ కొడప హన్నుపటేల్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు కుమ్ర భగవంత్‌రావు, సర్పంచుల సంఘం అధ్యక్షుడు మడావి భీంరావు, ఎంపీటీసీ జుగాదిరావు, సర్పంచులు, నాయకులు ఉన్నారు.

వాంకిడి: మండలంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు శనివారం ఇంటింటి ప్రచారం చేపట్టారు. మండలంలోని ఆయా గ్రామాల్లో ఎంపీపీ ముండె విమలబాయి, జెడ్పీటీసీ అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయా గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. పీఏసీఎస్ చైర్మన్ జబోరె పెంటు, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు తుకారాం, ఎంపీటీసీలు హిర్రె ప్రవీణ్, మారుతి, ఐటీడీఏ డైరెక్టర్ సోయం భీంరావు, నాయకులు ఉన్నారు.

‘ఎన్నికల బరిలో ఉంటా’

ఆసిఫాబాద్‌అర్బన్: ఆసిఫాబాద్ నియోజకవర్గ అభ్యర్థిగా ఎన్నికల బరిలో ఉంటానని బీజేపీ జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు కుందారపు వందన పేర్కొన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర నాయకత్వం తనకు టికెట్ ఇస్తానని మోసం చేసిందని, తనకు టికెట్ రాకుండా కొందరు జిల్లా నాయకులు కుట్రలు చేశారన్నారు. మహిళలకు 33శాతం రిజర్వేషన్ ఇస్తామన్న పార్టీ ఉమ్మడి జిల్లాలో ఒక్క టికెట్ కూడా మహిళకు ఇవ్వలేదని విమర్శించారు. పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. త్వరలో ప్రజలు, కార్యకర్తలు, అభిమానులతో చర్చించి భవిష్యత్తు కార్యచరణ ప్రకటిస్తానన్నారు.

‘బీజేపీకి అవకాశం ఇవ్వండి’



పార్టీలో చేరిన వారితో హరీశ్‌బాబు

దహెగాం: బీజేపీకి ఒక్కసారి అవకాశం ఇస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. శనివారం మండల కేంద్రంతో పాటు బొర్లకుంట, గెర్రె, రాంపూర్, మొట్లగూడ తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు బీజేపీలో చేరగా వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ మండల అధ్యక్షుడు రాపర్తి ధనుంజయ్, జిల్లా ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, బీసీ మోర్చా జిల్లా నాయకుడు నారాయణ, నాయకులు సురేశ్, సత్యం, లక్ష్మినారాయణ, తుమ్మిడె సురేశ్ పాల్గొన్నారు.

‘కాంగ్రెస్ గెలుపును ఎవరూ అడ్డుకోలేరు’



పార్టీలోకి ఆహ్వానిస్తున్న విశ్వప్రసాద్‌రావు, పక్కన అజ్మీరా శ్యానాయక్

రెబ్బెన: నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ గెలుపును అడ్డుకోలేరని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు విశ్వప్రసాద్ రావు, పార్టీ అభ్యర్థి అజ్మీరా శ్యానాయక్‌లు అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం విశ్వప్రసాద్‌రావు, శ్యామ్ నాయక్‌ల ఆధ్వర్యంలో ఆటో యూనియన్ నాయకులు, డ్రైవర్లు పార్టీలో చేరగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వారు మాట్లాడుతూ బీఆర్‌ఎస్ అవినీతి పాలనతో ప్రజలు విసుగుచెందారన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రమేశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దేవాజీ, నాయకులు సుదర్శన్‌గౌడ్, గోగర్ల రాజేశ్, నర్సింగరావు, వెంకటేశ్వర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

‘బీఆర్‌ఎస్‌తోనే నియోజకవర్గం అభివృద్ధి’



కుంచవెల్లిలో ప్రచారం చేస్తున్న కోనేరు వంశీ

దహెగాం: బీఆర్‌ఎస్‌తోనే నియోజకవర్గం అభివృద్ధి సాధ్యమని కోనేరు ట్రస్టు అధ్యక్షుడు కోనేరు వంశీ అన్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి కోనేరు కోనప్పను గెలిపించాలని శనివారం మండలంలోని చినరాస్పెల్లి, కుంచవెల్లి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా చినరాస్పెల్లి గ్రామానికి చెందిన యువకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. మండలంలోని దేవులగూడెం, కోత్మీర్ గ్రామాల్లో పార్టీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మండల రైతు బంధు సమితీ కన్వీనర్ సంతోష్‌గౌడ్, ఎంపీటీసీ రాకేశ్, నాయకులు రాజన్న, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

‘మీ అమ్మానాన్నల ఓటు మా నాన్నకే’

‘హాయ్ స్కూల్‌కు వెళ్తున్నారా.. ఇదిగో చాక్లెట్ తీసుకోండి.. కానీ మీ అమ్మానాన్నలను మా నాన్న కోనప్పకే ఓటు వేయమని చెప్పండి’ అంటూ కోనేరు వంశీ కుంచవెల్లి గ్రామంలో బడికి వెళ్తున్న పిల్లలతో సరదాగా ముచ్చటించారు.

‘రాష్ట్రంలో కాషాయ జెండా ఎగరడం ఖాయం’



చికెన్ కొడుతున్న బీజేపీ అభ్యర్థి అజ్మీరా ఆత్మారాం నాయక్

రెబ్బెన: త్వరలో జరగబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో కాషాయ జెండా ఎగరడం ఖాయమని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి అజ్మీరా ఆత్మారాం నాయక్ అన్నారు. మండలంలోని ప్రసిద్ధ గంగాపూర్ బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఎన్నికల ప్రచారం మొదలుపెట్టారు. గంగాపూర్, రెబ్బెన మండల కేంద్రాల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించి కమలం గుర్తుకు ఓటు వేసి ఆదరించాలని కోరారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలను ఆదరించిన ప్రజలు ఒక్కసారి బీజేపీకి అవకాశం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి ఓడెలు, నవీన్, జిల్లా కార్యదర్శి బాలక్రిష్ణ, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

ముక్క కొడతా... ఓటు పడుతా

మండల కేంద్రంలో బీజేపీ అభ్యర్థి అజ్మీరా ఆత్మారాం నాయక్ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తూ ఓ చికెన్ సెంటర్‌లో చికెన్ కొట్టి మరీ ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు.

విద్యాబోధనపై దృష్టి పెట్టండి

కెరమెరి: విద్యాబోధనపై ప్రత్యేక దృష్టి సారించి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని మోడి స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం స్వర్ణలత అన్నారు. శనివారం మోడి ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కాంప్లెక్స్ సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎస్సీఆర్‌పీ చహకటి శ్యాంరావు, ప్రధానోపాధ్యాయులు నైతం నారాయణ, దాము, భగవంత్‌రావు, కర్ను, మోతిరాం, మానిక్‌రావు తదితరులు ఉన్నారు.

‘ప్రవీణ్‌కుమార్ గెలుపునకు కృషి చేయాలి’



ప్రచారంలో టీ చేస్తున్న పునీత్

కౌటాల: సిర్పూర్‌లో ఆర్ఎస్పీ గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ తనయుడు రేపల్లె పునీత్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వ్యాపార సముదాయల్లో వ్యాపారులు, దుకాణదారుల వద్దకు వెళ్లి ఏనుగు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. అనంతరం పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు యువకులు పార్టీలో చేరారు. నియోజకవర్గ ఇన్‌చార్జి దుర్గం మోతిరాం, మండల అధ్యక్షుడు నాగపూరే బండు, నాయకులు లెండుగురే శ్యాంరావు, దుర్గం యశ్వత్‌రావు, దుర్గం వెంకటేశ్, సాయినాథ్, రుషి, ప్రశాంత్, శంకరయ్య, గోవింద్‌రావు, సురేష్, నాగయ్య, జనార్ధన్, సందీప్, ఆనంద్, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

గురుకుల హాస్టల్‌కు సొంత భవనం నిర్మించాలి



మాట్లాడుతున్న పురుషోత్తం

రెబ్బెన: మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల హాస్టల్‌కు సొంత భవనం నిర్మించాలని డీవైఎఫ్ఐ మండల సహాయ కార్యదర్శి చాపిడి పురుషోత్తం అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం మండలానికి మంజూరు చేసిన గురుకుల పాఠశాలను పాత బీసీ హాస్టల్ భవనంలో తాత్కాలికంగా ఏర్పాటు చేసి నడిపిస్తున్నారన్నారు. గదులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అధికారులు స్పందించి హాస్టల్‌కు సొంత భవనం మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. మండల సహాయ కార్యదర్శి శివ, కార్తీక్, కృష్ణ పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశం వాయిదా

తాంసి: భీంపూర్ మండల సర్వసభ్య సమావేశం వాయిదా పడింది. శనివారం నిర్వహించాల్సిన సమావేశానికి సభ్యులు హాజరు కాకపోవడంతో వాయిదా వేసినట్లు ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లకు, అధికారులకు ముందే సమాచారం ఇచ్చినా.. హాజరుకాలేదు. కొద్దిసేపు వేచి చూసి సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీవో ప్రకటించారు.

కాంగ్రెస్‌లో చేరికలు

కాగజ్‌నగర్‌టౌన్: కాంగ్రెస్ పార్టీ సిర్పూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి రావి శ్రీనివాస్ సమక్షంలో శనివారం చింతలమానెపల్లి మండలం డబ్బా గ్రామానికి చెందిన వివిధ పార్టీలకు చెందిన కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు ప్రకటించారు. అదే విధంగా బాబాసాగర్ నుంచి పలువురు గ్రామస్తులు కాంగ్రెస్‌లో చేరారు. మరోవైపు కాంగ్రెస్ అభ్యర్థి రావి శ్రీనివాస్ ప్రచారం నిర్వహించారు. ఎస్పీఎం కాంట్రాక్టు కార్మికులకు అండగా నిలిచి వారికి రావాల్సిన బకాయిలు, సౌకర్యాలు ఇప్పిస్తానని హామీ ఇచ్చారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని పైకాజీనగర్, పెట్రోల్‌పంప్, బస్టాండు, గుండి రోడ్ ప్రాంతాల్లో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పట్టణ విద్యుత్ శాఖ అధికారి సదాశివ్ ఒక ప్రకటనలో తెలిపారు. కుమురంభీమ్ చౌక్ నుంచి బస్టాండు వరకు కొత్త విద్యుత్ లైన్ వేస్తున్నందున విద్యుత్ అంతరాయం ఉంటుందని, ప్రజలు సహకరించాలని కోరారు.

గర్భిణులు జాగ్రత్తలు పాటించాలి

ఇచ్చోడ: చలికాలంలో గర్భిణులు జాగ్రత్తలు తీసుకోవాలని ఇచ్చోడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సాగర్ సూచించారు. శనివారం మండలంలోని దుబార్‌పేట్ గ్రామంలో పర్యటించి గర్భిణులకు జాగ్రత్తలను వివరించారు. పిల్లలకు తల్లిపాలు ఇవ్వడమే శ్రేయస్కారమన్నారు. ఆయన వెంట హెల్త్ అసిస్టెంట్ రాథోడ్ కైలాస్, ఏఎన్ఎంలు సుధారాణి, పద్మ పాల్గొన్నారు.